క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ బి.వి. సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చల్లపల్లివారి వీధి, జీఎస్‌రాజు రోడ్, రాణాప్రతాప్ రోడ్, కొమ్మువారి వీధి, బ్రహ్మయ్యపంతులు వీధి, సుమనంవారి వీధి, అమలి స్కూల్, మారుతి వ్యాయామశాల రోడ్డు, భగత్‌సింగ్ రోడ్, జనార్దనరావు వీధి, పాపరాజు వీధి, కనకరాజు వీధి, కావూరువారి వీధి, నర్రావారి వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఆఫ్రికాలో వ్యాపార అవకాశాలు సద్వినియోగం చేసుకోండి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆఫ్రికాలో ఉన్న అపార అవకాశాలు, వ్యూహాత్మక ప్రయోజనాలను వైవిధ్యాన్ని కోరుకునే పెట్టుబడిదారులు సద్వినియోగం చేసుకోవాలని అసోసియేటెడ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా(అసోచామ్) ఏపీ-తెలంగాణా హెడ్ మచ్చా దినేష్‌బాబు అన్నారు. నగరంలోని హోటల్ నోవాటెల్‌లో ఆఫ్రికాలో వ్యాపార అవకాశాలపై రెండు రోజుల పాటు సదస్సు జరిగింది. ఈ సదస్సులో దినేష్‌బాబు ఆఫ్రికాలోని అవకాశాలతో భారతీయ వ్యాపారాలను అనుసంధానం చేయడంపై అవగాహన కల్పించారు. అక్కడ వ్యాపార కార్యక్రమాలు నిర్వహించడం వలన కలిగే ప్రయోజనాలు, అంతర్జాతీయ మార్కెట్‌లో వ్యాపార సామర్థ్యాన్ని పెంచుకోవడాన్ని తెలిపారు. ఆఫ్రికాలో వ్యాపార అవకాశాలు తెలుసుకునేందుకు ప్రత్యేక పోర్టల్ www. africaforinvestors.com, www.ariseiip.com ని సందర్శించాలన్నారు.

రోడ్లపై సూచీల ఏర్పాటు



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్ గద్దే వెంకట్రామయ్యనగర్, దావు బుచ్చయ్యకాలనీ మెయిన్ రోడ్డులో గురువారం సూచీలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఇక్కడ రోడ్డును విశాలంగా తీర్చిదిద్దారు. ఇప్పుడు స్పీడు బ్రేకర్‌లు, మలుపులు, దేవాలయాలను తెలియజేసే సూచీలను ఏర్పాటు చేశారు. ఇక్కడ రోడ్డును నిర్మించినప్పటికీ సూచీలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు పడుతున్న అవస్థలు వివరిస్తూ సాక్షి కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు సూచీలు ఏర్పాటు చేశారు.

నేడు గుణదల - వీటీపీఎస్ 220 కేవీ లైన్ ఆధునికీకరణ పనులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): గుణదలలోని ఏపీ ట్రాన్స్‌కో 220 కేవీ ఉపకేంద్రం, వీటీపీఎస్ మధ్య ఉన్న విద్యుత్ లైన్ల ఆధునీకరణ పనులను శుక్రవారం చేపట్టనున్నట్లు గుణదల ఓఅండ్ఎం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.ఈశ్వరయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా వీటీపీఎస్ - గుణదల లైన్‌లో ఒక సర్క్యూట్ విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేస్తామన్నారు. దీని వలన విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఒక వేళ అత్యవసర పరిస్థితి ఏర్పడితే విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగవచ్చునని, ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

స్కేటర్ చైత్రదీపికకు అభినందన



విజయవాడస్పోర్ట్స్: జాతీయ, అంతర్జాతీయ ఆర్టిస్టిక్ పోటీల్లో రాణిస్తూ పతకాలు కైవసం చేసుకుంటున్న చైత్రదీపికను విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి అభినందించారు. తమిళనాడులోని కోయంబత్తూరులో ఇటీవల జరిగిన జాతీయ పోటీల్లో చైత్ర మూడు పతకాలు సాధించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యేలను వారివారి కార్యాలయాల్లో చైత్ర గురువారం మర్యాదపూర్వకంగా కలిసింది. రానున్న రోజుల్లో మరిన్ని అంతర్జాతీయ పతకాలు సాధించి విజయవాడ క్రీడా ఖ్యాతిని ప్రపంచానికి చాటాలని ఎమ్మెల్యేలు ఆమెకు సూచించారు.

గాయకుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి

విజయవాడకల్చరల్: గాయకుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పరపు బలరామ కృష్ణమూర్తి అన్నారు. స్వరార్చన సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదిక మీద గురువారం సినీ సంగీత విభావరి, గాయకులకు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిభకు ప్రోత్సాహం ఇవ్వాలని సూచించారు. చిట్టిబాబు, డేవిడ్‌రాజు, బీవీ వీరభద్రరావు, బోడి ఆంజనేయరాజు, సుశీల్‌కుమార్ పాల్గొన్నారు. గాయకులను ఆత్మీయంగా సత్కరించారు.

ఘనంగా స్వాతంత్య్ర వేడుకలు

రెపరెపలాడిన జాతీయ జెండా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్వాతంత్య్ర వేడుకలు గురువారం వాడవాడలా ఘనంగా జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలు, పలు రాజకీయ పార్టీల కార్యాలయాల వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. స్వాతంత్య్ర సముపార్జనలో అసువులు బాసిన మహనీయులకు నివాళులర్పించారు.

ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో...

బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా లైబ్రేరియన్ కె. రమాదేవి జాతీయ జెండా ఎగురవేశారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాపు(విక్టోరియా) మ్యూజియంలో జరిగిన వేడుకల్లో ఎంపీ కేశినేని శివనాథ్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. పురావస్తు శాఖ కమిషనర్ వాణీ మోహన్‌తో కలిసి మ్యూజియం సందర్శించారు.

ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో...

విజయవాడ ప్రెస్‌క్లబ్ వద్ద ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. యూనియన్ నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు. స్వాతంత్య్ర సమర యోధుల భవనంలో సర్వోదయ ట్రస్ట్ ఆధ్వర్యాన వేడుకలు నిర్వహించారు. గాంధీజీ విగ్రహానికి ట్రస్ట్ అధ్యక్షుడు జీవీ మోహన్ ప్రసాద్, బీజేపీ మాజీ అధ్యక్షుడు జయకర్ పూలమాలలు వేశారు. ట్రస్ట్ కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు, గుదే కమల, దావులూరి సాంబశివరావు పాల్గొన్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పైలట్ బంక్‌లో డివిజనల్ హెడ్ అనిల్ కుమార్‌తో కలిసి మేనేజర్ కె. వెంకటప్పయ్య పతాకాన్ని ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే హనుమాన్‌పేటలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం దాసరి భవన్‌లో స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ జాతీయ జెండా ఆవిష్కరించారు. రామమోహన గ్రంథాలయంలో గ్రంథాలయ అధ్యక్షుడు చింతలపూడి కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు దమ్మాల రామచంద్రరావు ఆధ్వర్యంలో స్వాతంత్య్ర వేడుకలు జరిగాయి.

బీసెంట్ రోడ్డు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో..

బీసెంట్ రోడ్డులోని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కార్యాలయం వద్ద స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. మల్లాది విష్ణు జాతీయ జెండా ఆవిష్కరించి మహనీయులకు నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో స్వాతంత్య్ర వేడుకలు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాల విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. స్వాతంత్య్ర దినోత్సవ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. వేడుకల్లో జాయింట్ కలెక్టర్ డా. నిధిమీనా, డీఆర్వో వి.శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసరెడ్డి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయంలో..

విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీఓ భవానీ శంకర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



బీసెంట్ రోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద జరిగిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



నందమూరినగర్‌లో జాతీయ జెండాను ఎగురవేస్తున్న డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

పాయకాపురం(విజయవాడరూరల్): రాజీవ్‌నగర్‌లోని వాసవీభవన్‌లో గురువారం జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో అంతర్జాతీయ వాసవీక్లబ్ మాజీ అధ్యక్షుడు హజరత్తయ్య గుప్తా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలు, చాక్లెట్లు పంపిణీ చేశారు. జిల్లా 203 గవర్నర్ కొత్త గణేష్‌బాబు, కేబినెట్ కార్యదర్శి సురేష్, వివిధ క్లబ్బుల సభ్యులు పాల్గొన్నారు. స్థానిక 64వ డివిజన్ కండ్రికలోని బీవీ సుబ్బారెడ్డి మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన వేడుకల్లో స్కూల్ కమిటీ చైర్మన్ రజియా సుల్తానా, కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. 62వ డివిజన్ పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్‌లో ఎస్ఎంసీ చైర్మన్ ఇ.సతీష్ జెండాను ఆవిష్కరించారు. 63వ డివిజన్ రాజీవ్‌గాంధీ మున్సిపల్ హైస్కూల్ నందు ఎస్ఎంసీ చైర్మన్ కె.శ్రీనివాస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

లబ్బీపేట(విజయవాడతూర్పు): స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గిరిపురం మూడు బొమ్మల సెంటర్‌లో 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

ప్రభుత్వ ముద్రణాలయంలో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు ప్రభుత్వ ముద్రణాలయంలో జాతీయ జెండాను ముద్రణాలయం డీజీఎం ఎల్. మోహన్‌కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగవరపు శరత్, ఎస్. సీతారామరాజు, కె. వెంకటేశ్వరరావు, ఏఎస్ఐ భానుప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

చుట్టుగుంటలో..

26వ డివిజన్ చుట్టుగుంట అల్లూరి సీతారామరాజు వంతెన సెంటర్‌లో జాతీయ జెండాను ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి, సతీష్, డివిజన్ అధ్యక్షుడు తోట పాండు పాల్గొన్నారు. 31వ డివిజన్ ముత్యాలంపాడులో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గొట్టుముక్కల వెంకటేశ్వరరాజు ఆధ్వర్యాన సీనియర్ నాయకుడు గంటా వెంకట సత్యనారాయణ జెండా ఆవిష్కరించారు.

పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో..

ముత్యాలంపాడు పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ డాక్టర్ గోపీ కృష్ణ జెండా వందనం చేశారు. డాక్టర్ తుమ్మల సాయిగోపాల్ తదితరులు పాల్గొన్నారు. దేవీనగర్ కాపు సేవాసంఘం కార్యాలయంలో ఆ సంఘం కార్యదర్శి ఇడుకుడి పాండు రంగారావు జెండా వందనం చేశారు. అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. అలాగే 31వ డివిజన్ శ్రీనగర్ కాలనీలో మాజీ కార్పొరేటర్ పిన్నంరాజు త్రిమూర్తిరాజు, 32వ డివిజన్ అయోధ్యనగర్ నాయీబ్రాహ్మణ వాయిద్య కళాకారుల సంఘం కార్యాలయం వద్ద కార్పొరేటర్ చన్నగిరి రామ్మోహనరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

అంబేడ్కర్ కాలనీలో..

అంబేడ్కర్ కాలనీ షీయోను ప్రార్థన మందిరంలో రెవరెండ్ కనమాల వరప్రసాద్ జెండా ఆవిష్కరణ చేశారు. దేశం బాగుండాలంటూ రోళ్లపాలెం హోలీక్రాస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యాన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సిటీవైడ్ ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ నగర అధ్యక్షుడు డీ మురళీ కృష్ణంరాజు ముత్యాలంపాడులో జాతీయ జెండా ఆవిష్కరించి మిఠాయిలు పంపిణీ చేశారు. దుర్గాపురం ఎస్‌టీవీఆర్ నగరపాలకసంస్థ పాఠశాలలో గురువారం స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకుని అన్న సంతర్పణ సమితి ఆధ్వర్యాన ఉచిత వైద్యశిబిరం జరిగింది. శిబిరంలో ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

విజయవాడ డివిజన్‌లో వేడుకలు...

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో స్వాతంత్య్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. రైల్వే మినీ స్టేడియంలో జరిగిన ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సీనియర్ డీఎస్‌సీ వల్లేశ్వర బి.టి.తో కలిసి ఆర్‌పీఎఫ్ బలగాలు, భారత్ స్కౌంట్ అండ్ గైడ్స్, జాక్ అండ్ జిల్ స్కూల్, ఎస్‌కేపీవీ స్కూల్ చిన్నారుల కవాతును పరిశీలించి వారి నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జీఎం స్వాతంత్య్ర దినోత్సవ సందేశాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆర్‌పీఎఫ్ సిబ్బంది కళ్లకు గంతలు కట్టుకుని ఒక్క నిమిషంలో 9ఎంఎం, ఏకే 47 మెషిన్ గన్‌లను సాధారణ పద్ధతిలో లోడ్ చేయడం, ఆర్‌పీఎఫ్ జాగిలం కిక్కిరిసిన ప్రేక్షకుల మధ్యలో నుంచి పేలుడు పదార్థాలతో నిండిన సూట్‌కేసును గుర్తించడం ప్రత్యేక ఆకర్షణగా నిలించింది. పలు పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. పలు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో..

ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ విజయవాడ డివిజన్ ప్రెసిడెంట్ డాక్టర్ వర్షా పాటిల్ జాక్ అండ్ జిల్ స్కూల్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రైల్వే హాస్పిటల్‌ను సందర్శించి రూ. 8 లక్షల విలువైన అధునాతన ఆర్థోపెడిక్ మిషన్‌లతో ఆపరేషన్ థియేటర్ టేబుల్‌ను అందజేశారు.

విజయవాడ కల్చరల్: గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం 78వ స్వాతంత్య్ర వేడుకలు జరిగాయి. గ్రంథాయల చైర్మన్ డొగిపర్తి శంకరరావు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు. అలాగే సూర్యారావు పేటలోని మహానటి సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. గాయకులు దేశ భక్తి గీతాలను ఆలపించారు. చుట్టుగుంటలోని శాతవాహనా కళాశాలలో కరస్పాండెంట్ నిడుమోలు రమా సత్యనారాయణ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు. అలాగే దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో స్వాతంత్య్ర వేడుకలను ప్రిన్సిపాల్ కృష్ణవేణి ఆధ్వర్యాన నిర్వహించారు. సత్యనారాయణపురంలోని అమరావతి బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 58వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ ముఖ్యఅతిథిగా పాల్గొని మువ్వన్నెల జెండాలను ఎగురవేశారు. సింగ్‌నగర్ సెయింట్ ఆన్స్ స్కూల్‌లో విద్యార్థులు జాతీయ జెండాలతో చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. 59వ డివిజన్‌లోని సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లో వైఎస్సార్ సీపీ కార్యాలయం, ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్ ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో కార్పొరేటర్ ఎండీ షాహీనా సుల్తానా పాల్గొని జెండాను ఎగురవేశారు. ఆజాద్ ముస్లిం కమిటీ ఆధ్వర్యాన సింగ్‌నగర్ ఎంబీ స్టేడియం సమీపంలో జరిగిన వేడుకల్లో ఆ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం చిన్నారులకు మిఠాయిలు, చాక్లెట్లు పంపిణీ చేశారు.

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురం గాయత్రీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన వేడుకల్లో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ బానిస సంకెళ్లను తెంచి, స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్న ఈరోజు మనందరికీ పర్వదినమన్నారు. స్థానిక కార్పొరేటర్ శర్వాణీమూర్తి, పలువురు నాయకులు పాల్గొన్నారు. చిత్తరంజన్ గ్రంథాలయంలో కార్పొరేటర్ శర్వాణీమూర్తి జెండాను ఆవిష్కరించారు. సత్యనారాయణపురంలోని సెయింట్ జాన్స్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆర్మీ హనరరి కెప్టెన్ కె.తిరుపతిరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. విద్యార్థులు జాతీయ నాయకుల వేషధారణతో ప్రదర్శించిన నాటకాలు ఆకట్టుకున్నాయి.

జిల్లా పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో..

విజయవాడస్పోర్ట్స్: జిల్లా పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా జరిగాయి. పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీపీలు గౌతమిశాలి, ఏ.బి.టి.ఎస్.ఉదయరాణి, టి.హరికృష్ణ, కె.చక్రవర్తి, ఏడీసీపీలు టి.కనకరాజు, ఎం.కృష్ణమూర్తినాయుడు, ఆర్.శ్రీహరిబాబు, డి.ప్రసాద్, ఏసీపీలు కేవీవీఎస్‌వీ ప్రసాద్, కె.వెంకటేశ్వర్లు, డి.ప్రసాదరావు పాల్గొన్నారు.

డీటీసీ కార్యాలయంలో..:

డెప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనరేట్‌లో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో డీటీసీ ఎం.పురేంద్ర పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. మోటారు వాహన తనిఖీ అధికారులు ఆర్.ప్రవీణ్, వెంకటేశ్వరరావు, శివరామగౌడ్, ఏపీ రవాణా శాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు యం.రాజుబాబు, కార్యాలయ పరిపాలనాధికారులు సి.హెచ్. శ్రీనివాసరావు, అబ్దుల్ సత్తార్, నాగ మురళి, ట్రాన్స్ పోర్ట్ కానిస్టేబుల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.భద్రాచలం, అధికారులు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ సృజన, జేసీ నిధి మీనా



విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీఓ భవానీశంకర్, సిబ్బంది



మువ్వన్నెల జెండా రెపరెపలు

పటమట(విజయవాడతూర్పు): నగర వ్యాప్తంగా స్వాతంత్య్ర వేడుకలను ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు, కార్యాలయాల్లో గురువారం వైభవంగా నిర్వహించారు. ఆయా కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు. దీంతో వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ప్రజలు, కార్పొరేషన్ సిబ్బంది రెండు కళ్లలాగా విజయవాడ నగరపాలక సంస్థకు సమన్వయంతో సహకరిస్తూ ఉండటంతోనే విజయవాడ నగరం అభివృద్ధి చెందుతుందని విజయవాడ నగర మేయర్ భాగ్యలక్ష్మి అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యక్రమంలో కమిషనర్ ధ్యానచంద్ర, కార్పొరేటర్లు, అధికారులతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అంతకు ముందు గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విభిన్న శాఖల్లో ప్రతిభావంతులకు పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ, ఆర్మీ, నేవీ, ఎయిర్ వింగ్, విద్యార్థులు నగర మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్రకు గౌరవ వందనం చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లు రహమతున్నీసా, షాహినా సుల్తానా, ఉమ్మడి చంటి, సత్తిబాబు, అడిషనల్ కమిషనర్లు డాక్టర్ ఏ మహేష్, కె.వి.సత్యవతి, చీఫ్ సిటీ ప్లానర్ ప్రసాద్, చీఫ్ ఇంజినీర్ ప్రభాకర్‌రావు, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రత్నావళి, డెప్యూటీ కమిషనర్ సృజన, అకౌంట్స్ ఆఫ్ ఎగ్జామినర్ చక్రవర్తి, అకౌంట్స్ ఆఫీసర్ బి.సత్యనారాయణమూర్తి, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



ఎంబీ స్టేడియం వద్ద జాతీయ జెండాకు వందనం చేస్తున్న నాగుల్‌మీరా, ఏఎంసీ నాయకులు



సెయింట్ జాన్స్ స్కూల్‌లో జాతీయ నాయకుల వేషధారణలో చిన్నారులు



పోలీస్ కమిషనరేట్‌లో గౌరవ వందనం చేస్తున్న సీపీ రాజశేఖరబాబు, పోలీస్ అధికారులు



వేడుకల్లో డీటీసీ పురేంద్ర



ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో స్వాతంత్య్ర వేడుకలు

నిస్వార్థ సేవే నిజమైన దేశభక్తి

విజయవాడస్పోర్ట్స్: నిస్వార్థంగా సేవ చేయడమే నిజమైన నిజమైన దేశ భక్తి అని విజయవాడ రెండో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎ.సత్యానందం తెలిపారు. విజయవాడ సివిల్ కోర్టుల ప్రాంగణంలోని బెజవాడ బార్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. బీబీఏ అధ్యక్ష కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగల శివరామప్రసాద్ (రాజా) అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.





చుట్టుగుంటలో జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా



ప్రభుత్వ ముద్రణాలయంలో మోహన్‌కుమార్, నాగవరపు శరత్



ముత్యాలంపాడులో జెండా వందనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



మహానాటి సావిత్రి కళాపీఠం ఆధ్వర్యంలో..



గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

మధురంగా సాగిన సంగీతోత్సవాలు

విజయవాడ కల్చరల్: శ్రీ మహదేవ రాధా కృష్ణంరాజు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యాన దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో గురువారం నిర్వహించిన సంగీతోత్సవాలు మధురంగా సాగాయి. మృదంగ విద్వాంసులు పొట్లూరి వీరరాఘవయ్య, దండమూడి రామ్మోనరావు, మహదేవ రాధాకృష్ణంరాజుల సంగీత సేవలను స్మరించుకుంటూ శిష్య ప్రశిష్యులు నిర్వహించిన మృదంగ లయ విన్యాసం కార్యక్రమాలు శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటాయి. హైదరాబాద్‌కు చెందిన కస్తూరి భాస్కర్, వరుణ్ రవిచంద్రన్, బెంగుళూరుకు చెందిన మొదలి కృష్ణసాయి, గుంటూరు చదలవాడ సూర్య, కాంచీపురానికి చెందిన కొండా సుబ్రహ్మణ్యం, కర్నూలు సాయి చరణ్, విశాఖకు చెందిన ప్రీతమ్, అక్షయ్ పాల్ పలు సంప్రదాయ కీర్తనలకు లయ విన్యాసం నిర్వహించారు. కుందుర్తి అరవింద్ రూపొందించిన లయారవిందం వెబ్‌సైట్‌ను అతిథులు ఆవిష్కరించారు. సంగీత విద్వాంసుడు నల్లాన్ చక్రవర్తుల కౌశిక్ కల్యాణ్‌కు మహదేవ లక్ష్మీనారాయణ రాజు స్మారక పురస్కారం ప్రదానం చేశారు.



కల్యాణ్‌కు మహదేవ లక్ష్మీనారాయణరాజు స్మారక పురస్కారం ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

చికిత్స పొందుతూ నాలుగేళ్ల చిన్నారి మృతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రమాదవశావత్తూ ఎలుకల మందు తిని నాలుగేళ్ల చిన్నారి మృతిచెందిన ఘటన గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. తెనాలికి చెందిన దేవరకొండ గోపి, తిరుపతమ్మ దంపతులు ఏడాది క్రితం నగరానికి వచ్చి గుణదల ఆదర్శకాలనీలో ఉంటున్నారు. వీరికి ఒక బాబు, పాప. ఈనెల 11వ తేదీన వారి కుమార్తె అమృత(04) ప్రమాదవశావత్తూ ఇంట్లోని ఎలుకల మందు తిన్నది. చిన్నారిని విజయవాడ పాతప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): యువతి అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. హనుమాన్ జంక్షన్ సమీపంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన అలేఖ్య ఎంబీఏ పూర్తి చేసింది. ఉద్యోగం నిమిత్తం కొంత కాలంగా గొల్లపూడిలో తల్లిదండ్రులతో కలిసి నివాసం ఉంటుంది. కాగా గురువారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో తల్లిదండ్రులు నిద్ర లేచి చూడగా అలేఖ్య కనిపించలేదు. దీంతో వారు చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద ఆరా తీశారు. యువతి ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.